నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

విజయనగరం(ఆంధ్రజ్యోతి), మార్చి 26: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు సీఈవో కె.రాజ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని జడ్పీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. సభ్యులు అడిగిన సమాచారం సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

మారని తీరు..



- వైసీపీకి అనుకూలంగా...
- చాప కింద నీరులా కొంతమంది వలంటీర్ల ప్రచారం
- వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం షేర్
- ఫారం-12డీ పై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి, మార్చి 26

ఎన్నికల సంఘం ఎంతగా హెచ్చరిస్తున్నా.. జిల్లాలో కొందరి వలంటీర్ల తీరు మారడం లేదు. కోడ్‌ను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ.. ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు. యథేచ్ఛగా రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. సస్పెన్షన్‌కు గురవుతున్నా.. వెనక్కి తగ్గడం లేదు. గరుగుబిల్లి మండలం విషయానికొస్తే.. 13 సచివాలయాల పరిధిలోని పలువురు వలంటీర్లు చాపకింద నీరులా అధికార పార్టీ తరఫున పని చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభంకాకపోయినప్పటికీ వాట్సాప్ గ్రూపుల్లో పలు సమాచారాన్ని షేర్ చేస్తున్నారు. ఎన్నికల సర్వే, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి అంతా ఒక చోట చేరాలని , ఎవరూ గైర్హాజరు కాకూడదని కొందరు వలంటీర్లు వాట్సాప్ గ్రూప్‌లో చాట్ చేసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన బాధ్యతలపై ఇప్పటికే గ్రామస్థాయి వైసీపీ నేతలు ఫోన్లలో కొంతమంది వలంటీర్లకు సమాచారం అందిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు వివరించి ఎన్నికల్లో అభ్యర్థి గెలిచేలా సహకరించాలని కోరుతున్నారు. ప్రధానంగా 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12డీ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తున్నారు. దీంతో కొందరు వలంటీర్లు గ్రామస్థాయిలో వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి.. పోస్టల్ బ్యాలెట్‌లో ఓటుకోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు వలంటీర్లు.. ప్రభుత్వ సిమ్‌లకు బదులుగా వేరేగా సిమ్‌లు కొనుగోలు చేసి ఆ నెంబర్లతో వైసీపీ మండల ప్రతినిధులతో నిత్యం అందుబాటులో ఉంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బయటపడితే వేటు తప్పదన్న విషయాన్ని గ్రహించి వాట్సాప్ గ్రూపుల్లో సమాచారాన్ని షేర్ చేసుకుంటున్నారు. దీనిపై ఎన్నికల సంఘం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లో పెట్టిన సమాచారం


దాసుగుమ్మడ పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందితో చర్చిస్తున్న ఐటీడీఏ పీవో

సిగ్నల్స్ లేని పోలింగ్ కేంద్రాల పరిశీలన

సీతంపేట: పాలకొండ నియోజకవర్గ పరిధిలో సిగ్నల్స్ లేని పోలింగ్ కేంద్రాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి తెలిపారు. మంగళవారం సీతంపేట మండలంలో సిగ్నల్స్ లేని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ మేరకు దాసుగుమడ, పెద్ద తంకిడి , గుజ్జి, పెద్ద పల్లంకి, చిన్నపల్లంకి, బర్న కేంద్రాల్లో నెట్‌వర్క్ పరిస్థితిని పరిశీలించారు. వాటికి సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామని స్పష్టం చేశారు. ఆమె వెంట సీతంపేట తహసీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం ఎమ్మెల్యేపై కోడ్ ఉల్లంఘన కేసు

పార్వతీపురం టౌన్, మార్చి 26: పార్వతీపురం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే అలజంగి జోగారావుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. ఈ మేరకు పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఈనెల 21న జిల్లా కేంద్రంలోని కొత్తవలస నవదుర్గా ఆలయం వద్ద వలంటీర్లు, గృహ సారథులతో పాటు సంబంధింత ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే జోగారావు సమావేశం నిర్వహించారు. అంతేకాకుండా 6వవార్డులోని రాజీవ్ కొత్త పోలమ్మ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సమాచారం తెలుసుకున్న 8వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, టీడీపీ నాయకులు మజ్జి కృష్ణమోహన్, ఎం.వెంకటేష్, పాలకొండ రాజశేఖర్, తదితరులు అక్కడకు వెళ్లారు. అయితే టీడీపీ నాయకులు వస్తున్నారన్న సమాచారాన్ని అందుకున్న వార్డు వలంటీర్లు, గృహసారథులు నవదుర్గా ఆలయం నుంచి జారుకున్నారు. ఇదే సమయంలో వైసీపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ టీడీపీ నాయకులు ఆ ప్రాంతంలో నిరసన తెలిపారు. దీనిపై పట్టణ పోలీసులతో పాటు సంబంధిత ఎన్నిక అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఎట్టకేలకు ఎన్నికల నిబంధనలను ఎమ్మెల్యే ఉల్లంఘించడంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం కలెక్టర్ నిశాంత్ కుమార్ కూడా ఈ విషయం వెల్లడించారు. అధికారులు ఇచ్చిన సమాచారం, పోలీసుల దర్యాప్తుపై విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.


ఈనెల 21న నవదుర్గా ఆలయం వద్ద ఎమ్మెల్యే జోగారావు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)/ పార్వతీపురం టౌన్: రాజకీయ పార్టీలతో పాటు ఉద్యోగులెవరైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ... 'ఈనెల 16న ఎన్నికల కోడ్ అమలులోకి రాగా ఇప్పటివరకు జిల్లాలో 161 ఫిర్యాదులు అందాయి. వాటిన్నింటినీ పరిష్కరించడంలో సఫలీకృతులమయ్యాం. సి-విజిల్‌లో 12 ఫిర్యాదులు అందాయి. 38 నిమిషాల 42 సెకండ్లలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. ఎన్నికల అనుమతులకు సంబంధించి ఎవరైనా సువిధ యాప్ ద్వారా 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి. పార్వతీపురం నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద ఒక ఎఫ్ఐఆర్ నమోదైంది. జిల్లాలోని ప్రభుత్వ స్థలాల్లో వివిధ పార్టీలకు చెందిన 15,560 బ్యానర్లు, పోస్టర్లు తొలగించాం. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా పనిచేసిన 13 మంది వలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగితో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నాం. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరిగిన చోట 144 సెక్షన్‌ను పక్కా అమలు చేస్తాం. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగు లకు బీఎల్వోల ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపడుతున్నాం.' అని తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

సరిహద్దుల్లో..

ఎన్నికల నేపథ్యంలో మద్యం, సారా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఒడిశా రాష్ట్ర కలెక్టర్, ఉన్నతాధికారులతో చర్చలు జరిపామని కలెక్టర్ తెలిపారు. 'జిల్లాలోని ములిగూడ, బత్తిలి, భామిని, పి.కోనవలస, కూనేరు తదితర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు, వెబ్ కాస్టింగ్‌లను ఏర్పాటు చేశాం. మరో 5 చెక్‌పోస్టుల వద్ద వెబ్ కాస్టింగ్‌లను ఏర్పాటు చేస్తాం.పరస్పర సహకారంతో ఒడిశా, ఆంధ్రా సరిహద్దుల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. వివాదాస్పద ఏవోబీ ప్రాంతం కొరియా గ్రామాలకు చెందిన ప్రజలు ఇరు రాష్ట్రాల ఓటింగ్‌లో పాల్గొనొచ్చు' అని ఆయన స్పష్టం చేశారు.

పర్యవేక్షణకు బృందాలు..

వచ్చే నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని.. 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని కలెక్టర్ చెప్పారు. ' ఈ మేరకు జిల్లాలో ఎన్నికల నిర్వహణను 48 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 36 ఎస్ఎస్‌టీ బృందాలు, 16 వీఎస్‌టీ బృందాలు పర్యవేక్షిస్తాయి. పార్వతీపురం, పాలకొండ, కురుపాంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. పార్వతీపురం ఉద్యాన కళాశాలలో ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుంది. జిల్లాలో 144 సెక్టార్లు, 151 రూట్లు ఏర్పాటు చేశాం.' అని ఆయన తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత..

జిల్లాలో ప్రశాంత ఎన్నికల కోసం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఇప్పటికే జిల్లాకు మూడు సీఆర్పీఎఫ్ కంపెనీ దళాలు వచ్చాయన్నారు. మండల, పట్టణ కేంద్రాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవ నాయుడు పాల్గొన్నారు.

వీరికే పోస్టల్ బ్యాలెట్

- 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు..

(కొమరాడ)

ఓటు వజ్రాయుధం లాంటిది. ఐదేళ్లకొకసారి వచ్చే సార్వత్రిక సమరంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని అందరూ భావిస్తారు. కానీ వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాల వరకు చేరుకోలేని పరిస్థితి. అయితే ఇటువంటి వారందరికీ ఎన్నికల సంఘం తీపి కబురు చెప్పింది. తాజా ఎన్నికల్లో 85 ఏళ్ల వయసు దాటిన వృద్ధులు, గుర్తింపు పొందిన ప్రత్యేక ప్రతిభావంతులు (దివ్యాంగులు) పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు ప్రత్యేకంగా ఫారం-12డీ దరఖాస్తు చేసుకున్న వారికి పోలింగ్ రోజున సిబ్బందే ఇంటికి వచ్చి ఓటు నమోదు చేసుకుంటారు. జిల్లాలో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు బీఎల్‌వోల వద్ద ఉన్న ఫారం-12డీ దరఖాస్తులు నింపి అందిస్తే చాలు.

రహస్య పద్ధతిలో ఓటింగ్

ఎవరైతే ఇంటి వద్దే ఓటు వేయాలని ఫారం-12డీ దరఖాస్తు నింపి అందిస్తారో.. ఆటువంటి వారి ఇంటికి ఎన్నికల సిబ్బంది మొబైల్ వ్యాన్‌లో చేరుకుంటారు. ఇందులో ఇద్దరు పోలింగ్ అధికారులు, ఒక వీడియో గ్రాఫర్, మరో రక్షణ అధికారి ఉంటారు. అక్కడ ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందిస్తారు. అధికారులు నిర్దేశించిన పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఓటరు రహస్యంగా ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేస్తారు. ఈ ప్రక్రియను అధికారులు పూర్తిగా వీడియో చిత్రీకరణ చేస్తారు. ఈ ప్రక్రియ సాధారణ ఎన్నికలకు ఒక రోజు ముందుగానే పూర్తి చేస్తారు.



రెండు సార్లు అవకాశం

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 85 ఏళ్ల దాటిన వారు సుమారు 10 వేల మంది ఉన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పీహెచ్‌సీ పింఛన్లు పొందుతున్న వారు 17 వేల మంది వరకు ఉన్నారు. కాగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలనుకుంటే ముందుగా వారంతా దరఖాస్తు చేసుకోవాలి. వారు దరఖాస్తులో రాసిన ఫోన్ నెంబరుకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం అధికారులు వచ్చే రోజు, సమయాన్ని ముందుగానే సంక్షిప్త సందేశం పంపిస్తారు. మొదటిసారి ఓటరు అందుబాటులో లేకపోతే పోలింగ్ సిబ్బంది రెండోసారి ఇంటికి వెళ్తారు. రెండు సార్లు లేకపోతే వారు ఓటు వేసే అవకాశం కోల్పోతారు.

ఎన్నికల వేళ కలకలం

- మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రం సీజ్‌తో ఉలిక్కి పడిన సాలూరు ఏజెన్సీ
- పోలీసులు అప్రమత్తం

సాలూరు రూరల్, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల వేళ ఏవోబీ(ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం)లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా దళాలు గుర్తించడంతో సాలూరు ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మావోయిస్టుల రాకపోకలు తగ్గాయని ఇన్నాళ్లు భావించగా.. తాజా ఘటన కలకలం రేపింది. సాలూరు ఏజెన్సీకి సమీపంలో.. పాచిపెంట మండలం కుంతాం, పద్మాపురం గ్రామాలకు అతి చేరువలో ఉన్న ఏవోబీ ఒడిశా ఆలాశీలో సుంకి బీఎస్ఎఫ్ దళం ఇటీవల మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని గుర్తించి సీజ్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. దీనిపై జిల్లా పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు. వాస్తవంగా పార్వతీపురం మన్యం మావోయిస్టుల ప్రభావిత జిల్లాగా కేంద్రప్రభుత్వ జాబితాలో ఉంది. గతంలో మావోయిస్టుల రాకపోకలు ముమ్మరంగా ఉండేవి. అయితే కొంత కాలంగా ఈ ప్రాంతంలో వారి జాడ లేదని పోలీసులు భావిస్తూ వస్తున్నారు. అయితే తాజాగా ఎన్నికల నేపథ్యంలో ఏవోబీలో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రం బయటపడడంతో ఇరు రాష్ట్రాల పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఏవోబీలో మావోయిస్టు ఆయుధ తయారీ కేంద్రం ఉందని చెప్తున్న ఆలాశీ సమీపంలోనే ఈ నెల 22న సాలూరు సీఐ బాలకృష్ణ, పాచిపెంట ఎస్ఐ నారాయణరావు, సునాబేడ డీఎస్పీ మనోభ్రాత శతపథి, ఇరు రాష్ట్రాల పోలీసు సిబ్బంది కలిసి సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. కాగా మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రంపై ఏపీ పోలీసులు ఒడిశా పోలీసులతో మంగళవారం చర్చించారు. పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు ఏవోబీలో ఒడిశా, ఏపీ పోలీసుల కూంబింగ్‌ను ముమ్మరం చేశారు.


ఏవోబీలో సుంకి బీఎస్ఎఫ్ గుర్తించిన మావోయిస్టు ఆయుధ తయారీ కేంద్రం

ప్రత్యేక భద్రత చర్యలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాలూరు ఏజెన్సీలో ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టాం. ఏజెన్సీలో కూంబింగ్‌ను కొనసాగిస్తున్నాం. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నాం. ఆలాశీ సంఘటనపై పూర్తి వివరాలు సేక రిస్తున్నాం.

\- బాలకృష్ణ, సీఐ, సాలూరు రూరల్

అవకతవకలకు పాల్పడొద్దు

- జీసీసీ డీఎం మహేంద్రకుమార్

సాలూరు రూరల్, మార్చి 26: జీసీసీలో అమ్మకాలు, కొనుగోలులో అవకతవకలకు పాల్పడినా, ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించినా కఠిన చర్యలు తప్పవని జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్ హెచ్చరించారు. మంగళవారం సాలూరు జీసీసీ కార్యాలయంలో పాచిపెంట, సాలూరు, మక్కువ, మెంటాడ, రామభద్రపురం జీసీసీ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఆర్ డిపోలను నిర్ణీత వేళల్లో తెరవాలని, ఎండీయూ ఆపరేటర్లతో సమన్వయం చేసుకుని కార్డుదారులకు సకాలంలో సరుకులు పంపిణీ అందించాలని తెలిపారు. నిత్యం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అటవీ , వ్యవసాయ ఉత్పత్తులు, డీఆర్స్ వసతిగృహాలకు సరుకుల సరఫరా, వసూలు తదితర అంశాలపై జీసీసీ సాలూరు మేనేజర్ రామారావును అడిగి తెలుసుకున్నారు. సాలూరు బ్రాంచి రూ. 8.12 కోట్ల లక్ష్యానికిగాను ఇప్పటి వరకు రూ. 7.16 కోట్లు సాధించిందన్నారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో రూ. 60 కోట్ల లక్ష్యం సాధించినట్టు చెప్పారు. అనంతరం ఆయన జీసీసీ గిడ్డంగిలో సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

వైభవంగా డోలోత్సవం

- వంశధార నదిలో రాధాకృష్ణ ఉత్సవమూర్తులకు చక్రతీర్థ స్నానం
- పోటెత్తిన భక్తజనం


నదిలో భక్తుల సందడి


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

భామిని: లివిరిలో గోపీనాథ రాధారాణి డోలోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉత్సవాలు ప్రారంభమవగా.. ఆ గ్రామంలో భక్తజన సందడి నెలకొంది. రోజూ వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఆలయంలో రాధాకృష్ణలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కాగా మంగళవారం రాధాకృష్ణ ఉత్సవమూర్తులకు మేళతాళాలతో తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న, పెద్దా అంతా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని ఆటపాటలతో పురవీధుల్లో సందడి చేశారు. అనంతరం వంశధార నదిలో భక్తుల నడుమ రాధాకృష్ణ ఉత్సవ మూర్తులకు చక్రతీర్థ స్నానం చేశారు. పర్లాకిమిడికి చెందిన గజపతిరాజుల వారసురాలు కల్యాణి గజపతిరాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంతో పాటు సరిహద్దులో ఉన్న ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి, కాశీనగర్, గుణుపూర్ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు హోలీలో పాల్గొని రాధా పాదదర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

భక్తజన శంబరం

- ఆఖరి వారం పోలమాంబ దర్శనానికి బారులు
- ముగిసిన జాతర

మక్కువ: శంబరలో పోలమాంబ పదో వారం జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం.. కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలమాంబ దర్శనానికి భక్తులు బారులు దీరారు. దీంతో వనం, చదురు గుడుల్లో క్యూలైన్లు కిటకిటలాడాయి. గంటల కొద్దీ నిరీక్షించిన అనంతరం భక్తజనం అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు. 'పోలమాంబ.. కరుణించు' అంటూ వేడుకున్నారు. అనంతరం వనం గుడి వద్ద వేప చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కొందరు గోముఖీ నదీతీరాన చీరలు, కోళ్ల, పసుపు కుంకమలతో మొక్కులు చెల్లించుకున్నారు. చివరి వారం జాతర కావడంతో మరోవైపు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వనం గుడి వద్ద చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పోలమాంబ ఉత్సవమూర్తిని సింహాసనంపై వేంచేసిన అనంతరం కుంకుమపూజ, పంచాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో సుమారు ఆరు వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో జిల్లా దేవదాయశాఖాధికారి డీవీవీ ప్రసాదరావు, ఈవో వీవీ సూర్యనారాయణ, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా పదో వారంతో శంబర పోలమాంబ జాతర ముగిసింది.


చండీహోమంలో పాల్గొన్న భక్తులు


పూజలందుకున్న శంబర పోలమాంబ

వైసీపీ ఓటమే లక్ష్యం

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా మహిళలంతా ముందుకు సాగాలని టీడీపీ మహిళా విభాగం నాయకులు అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని 1, 13, 14 డివిజన్ల టీడీపీ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సమావేశం 13వ డివిజన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా యాదవుల గావు పండుగ

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో మంగళవారం యాదవుల ఇలవేల్పు గావు పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా ఏకమై గావు పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.కోట నియోజకవర్గ కూటమి అభ్యర్థి కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ హాజరయ్యారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయ నృత్యాలైన కోయడాన్సులు, తప్పెటగుల్లుతో పండగను హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నేతలు, పలువురు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలి

విజయనగరం దాసన్నపేట: నగరపాలక సంస్థ పరిధిలో 2014 నుంచి 2019 వరకూ టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు వెంటనే పట్టాలు అందజేయాలని బీజేపీ మైనార్టీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు బిలాల్ అహ్మద్ కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడిని కలిసి వినతిపత్రం అందించారు. లబ్ధిదారులు పలు దఫాలుగా గృహాలకు డీడీలు అందజేశారన్నారు. నేటికీ కొంత మందికి గృహాలు మంజూరు చేయలేదన్నారు.

ఉచిత సీట్లకు దరఖాస్తు గడువు పెంపు

కలెక్టరేట్: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లకు దరఖాస్తు గడువు ఈనెల 31వ తేదీ వరకూ పెంచుతున్నట్లు డీఈవో ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు, రేపు పెన్షన్, తపాలా అదాలత్‌లు

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని దోమల మందిరం వద్ద గల ప్రధాన తపాలా శాఖ కార్యాలయంలో పెన్షన్, తపాలా అదాలత్‌లను నిర్వహిస్తున్నట్టు సూపరింటెండెంట్ ఎస్వీ సత్యనారాయణ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న ఉదయం 10 గంటల నుంచి పెన్షన్‌దారుల సమస్యల కోసం పెన్షన్ అదాలత్‌ను, 28న ఉదయం 10 గంటల నుంచి తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక వ్యక్తిగత ఫిర్యాదుల కోసం తపాలా అదాలత్‌ను నిర్వ హిస్తున్నామన్నారు. పోస్టు ద్వారా గానీ, నేరుగా గానీ ఈ అదాలత్‌లలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

నేడు కింజంగిలో టీడీపీ ప్రచారం

వంగర: మండలంలోని కింజంగి, మరువాడ, ఇరువాడ, కొనంగిపాడుల్లో బుధవారం టీడీపీ రాజాం నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ప్రచారం చేయనున్నారని పార్టీ నాయకులు తెలిపారు. గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖరరావు అన్నారు. బూసాయవలసలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మండల యువజన విభాగం అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్ ఆధ్వర్యంలో యువజన సమ్మేళనం నిర్వహించారు. బొబ్బిలి అసెంబ్లీ అభ్యర్థి శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జడ్పీటీసీ అప్పి కొండ సరస్వతమ్మ, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి: కారాడ, అలజంగి, జగన్నాథపురం గ్రామాల్లో ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల బృందం మంగళవారం పర్యటించింది. పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి, ఈవోఆర్డీ అల్లు భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

1న గాయని సుశీలకు పురస్కారం

విజయనగరం రూరల్: గురు నారాయణ కళాపీఠం తృతీయ వార్షికోత్సవాన్ని వచ్చే నెల 1న ఘనంగా నిర్వహించనున్నట్టు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బీఏ నారాయణ తెలిపారు. మంగళవారం ఓ ప్రైవేటు హోటల్‌లో కళాపీఠం ప్రతినిధులు జి.సన్యాసమ్మ, పద్మావతి, వైవీ సత్యనారాయణ, బాబూరావు తదితరులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ నేపథ్య గాయని పి.సుశీలకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసున్నట్టు తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మను, లవకుశ చిత్రంలో కుశుడు పాత్రధారి వి య్యారి సుబ్రహ్మణ్యంను సత్కరించనున్నామన్నారు.

పోలీసుల లాంగ్ మార్చ్

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ జ్ఞానప్రసాద్ కోరారు. మండలంలోని తారాపురం, బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో వివాదాలు, తగవులు సృష్టించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్పీఎఫ్ పోలీసులతోపాటు స్థానిక పోలీసులు ఆయుధాలతో గ్రామంలోని వీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

తూర్పు కాపులకు ఎంపీ టిక్కెట్ ఇవ్వండి

విజయనగరం దాసన్నపేట: రానున్న ఎన్నికల్లో తూర్పుకాపులకు ఎంపీ టిక్కెట్‌ని కేటాయించాలని ఆ సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షుడు రొంగలి రామారావు కోరారు. మంగళవారం కామాక్షినగర్‌లోని వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో తూర్పుకాపులు అత్యధికంగా ఉన్నారని.. ఏ పార్టీ అయినా గెలుపోటములు వారిపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. సమావేశంలో సంఘ నాయకులు నాగభూషణం, టి.వెంకట రమణ, మంత్రి రమణమూర్తి, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

గుళ్లసీతారాంపురంలో డోలోత్సవాలు

రాజాం: సంకతవిటి మండలంలోని గుళ్లసీతారాంపురం సీతారాముల ఆలయంలో డోలా పౌర్ణమి పురస్కరించుకుని స్వామి వారి తోటలో డోలోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మండపం మీదకు తీసుకువచ్చి స్వామివారిని ఉయ్యాలలో ఆశీనులు చేశారు. ఈ సందర్భంగా రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో అలసత్వం వద్దు

● పోలింగ్ బూత్‌ల పరిశీలనలో ఆర్డీవో సాయిశ్రీ

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు అలసత్వం చూపరాదని ఈఆర్వో, సబ్ కలెక్టర్ సాయిశ్రీ స్పష్టం చేశారు. మంగళవారం కొట్టక్కి, తారాపురం పోలింగ్ స్టేషన్లను ఆమె పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి వాటిపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికల నియమాలను ఉల్లంఘించకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, పంచాయతీ కార్యదర్శి పడాల భాస్కరరావు, వీఆర్వో హరిబాబు పాల్గొన్నారు.

బాడంగి: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా బొబ్బిలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మంగళవారం కోటిపల్లిలోని 174, 175 బూత్‌లను, ముగడలోని 179, 180 బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల స్థాయి రటర్నింగ్ అధికారులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ లీడర్లు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించాల న్నారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌లలో తాగునీరు, విద్యుత్‌తోపాటు వికలాంగులు వచ్చేందుకు స్కూళ్ల వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. మండల ఆర్వో రాజారావు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ లీడర్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కోటిపల్లిలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

కూటమితో రాష్ట్రానికి స్వర్ణయుగం

● రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్

రాజాం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో రాష్ట్రానికి స్వర్ణయుగం వస్తుందని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మంగళవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో బొద్దాం గ్రామా నికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. బట్న పద్మావతి, బైరి జగన్నాథం, పరసురాపు చిన్నమ్మ, బూరి రామినాయుడు, ముద్దాడ అసిని నాయుడు, నర్సింహులు, పాపినాయుడు, దాలినాయుడు తదితరులను కండువాలువేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ టీడీపీ గెలుపుకోసం కృషి చేయా లన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే బీసీల సాధికారత, సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, గురవాన నారాయణరావు, శ్రీనివాసరావు, వంగా వెంకటరావు, రగుమండల గణప తినాయుడు, మాడుగుల జయరాం, బోనెల నారాయణరావు, చీడికుమార్, కె.జగదీష్, సీహెచ్ భూషణం, ఎం.రమేష్, కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కోండ్రు

రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

విజయనగరం రూరల్: రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు చెప్పారు. నగరంలోని 6, 7, 45 డివిజన్ల వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ఆ పార్టీని వీడి, మంగళవారం టీడీపీలో చేరారు. కంది రాంబాబు, కోట్ల అప్పలనాయుడు, ఆల్తి చిట్టిబాబుతో పాటు 80 కుటుంబాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకుని పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **విజయనగరం రూరల్:** ఓటర్ల జాబితాపై క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 10 వరకూ కొత్త ఓటర్లను చేర్పించేందుకు గడువు ఉండడంతో దొంగ ఓట్లను నమోదు చేసే అవకాశం ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప అడ్డుకోలేమన్నారు.



పార్టీలో చేరిన వారితో అదితి

బేబీనాయన ఇంటింటి ప్రచారం

బొబ్బిలి: బొబ్బిలి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) మంగళవారం పట్టణంలోని ఆరో వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బేబీనాయనకు ఘనస్వాగతం పలికారు. అభిమానులు అందజేసిన పూలబాణాన్ని బేబీనాయన ఎక్కుపెట్టారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్ కోసం చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల అడ్డాగా విశాఖను తయారు చేసి ప్రపంచ స్థాయిలో తలవంపులు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు బేబీనాయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, లంక రమేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, నాయకులు పువ్వల శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్, వెలగాడ హైమావతి వాసు, కింతలి శ్రీదేవి బంగార్రాజు, మామిడి ప్రసాద్, మున్నా, కేతిరెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అభిమానులు ఇచ్చిన పూలబాణాన్ని ఎక్కుపెడుతున్న బేబీనాయన

తెలగలను గుర్తించండి

బొబ్బిలి: తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని అనేక దశాబ్దాలుగా పోరాడుతున్నామని... అయినా ఏ రాజకీయ పార్టీ పట్టించుకోవడం లేదని.... ఈ ఎన్నికల్లో తెలగ కులస్థుడిని అభ్యర్థిగా బరిలోకి దింపుతామని ఆ సంఘ నాయకులు ఆకుల దామోదరరావు, పాతిరెడ్డి హరికృష్ణ తెలిపారు. మంగళవారం బొబ్బిలిలో వారు విలేకరులతో మాట్లాడారు. తెలగ కులస్తులలో మెజారిటీ ప్రజలు అత్యంత దయనీయమైన జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్నికల బరిలో తెలగ కుల అభ్యర్థిని దించుతామని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న తెలగ సంఘం నాయకులు

అర్చకులపై దాడి దారుణం

విజయనగరం రూరల్: అర్చకులపై దాడులు హేయమైన చర్యని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఒక ప్రకటనలో ఖండించారు. కాకినాడ శివాలయంలో అధికార పార్టీకి చెందిన వారు ఇద్దరు అర్చకులను కాలితో తన్నడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఈ సంఘటనకు కారకులైన వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

● కాకినాడలోని శివాలయంలో అధికార వైసీపీ నాయకుడు ఇద్దరు అర్చకులు సాయిశర్మ, విజయ్‌కుమార్ శర్మలను కాలితో తన్ని భౌతిక దాడి చేయడాన్ని టీడీపీ బ్రాహ్మణ విభాగం ఖండించింది. మంగళవారం పార్టీ కార్యాలయంలో బ్రాహ్మణ విభాగ నాయకులు పేరి రామయ్య పంతులు, ద్వాదశి వేణురమణమూర్తి మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో హిందూ దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆ ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. అర్చకులను ఆలయ ప్రాంగణంలోనే కాలితో తన్నడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.

విజయనగరం రింగురోడు: తూర్పుగోదావరి జిల్లా కాకినాడ శివాలయంలో అర్చకులుగా పని చేస్తున్న సాయిశర్మ, విజయకుమార్ శర్మలపై వైసీపీ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్ భౌతికదాడికి పాల్పడడం హేయమైన చర్యని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జాతీయ ఉపాధ్యక్షుడు జంధ్యాల బుచ్చిబాబు అన్నారు. మంగళవారం ఓం మందిరం వద్ద గల సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నిందితుడిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రశేఖర్ భేషరతుగా అర్చకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దొంగ మస్తర్లను నిరోధించాలి

రామభద్రపురం: నర్సాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అవకత వకలు జరుగుతున్నాయని తెలుగుదేశం నాయకుడు, సర్పంచ్ కోట వెంకటనా యుడు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో ఈశ్వరమ్మకు వినతిపత్రం ఇచ్చారు. వంద రోజులు పని పూర్తయినప్పటికీ కొంతమందికి మేట్ మస్తర్లు వేస్తున్నారని తెలిపారు. ఇక్కడికి ఫీల్డ్ అసిస్టెంట్ రాకపోవడంతో అధి కార పార్టీకి చెందిన మేట్ అవకతవకలకు పాల్పడుతోందని తెలిపారు. దీనిపై ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఏపీవోను గ్రామంలోకి పంపించి పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మూతపడిన బోర్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శృంగవరపుకోట రూరల్: మండలంలోని కాపుసోంపురం గ్రామం వద్ద జగన్న బోర్డుపై ఎటువంటి మూత వేయలేదని ఎన్నికల కోడ్ పట్టదా అని రెండురోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయిన వార్తపై అధికారులు స్పందించారు. మంగళవారం ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బంగారునాయుడు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే దీనిపై పేపర్ అతికించామని అయితే వర్షం పడిన కారణంగా ఊడిపోయిందన్నారు. అయితే పేపర్లో రావడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు మరోసారి సీఎం ఫొటో కనిపించకుండా మొత్తం పేపర్ వేశామని తెలిపారు.



కాపుసోంపురం గ్రామం వద్ద ముఖ్యమంత్రి ఫొటో ఉన్న బోర్డును మూసివేసిన దృశ్యం

భక్తిశ్రద్ధలతో పైడితల్లి మారుజాతర

రాజాం/రూరల్: రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి మారుజాతర మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈనెల 17 నుంచి 19 వరకు అమ్మవారి 98వ వార్షిక జాతర మహో త్సవాలు జరిగిన విషయం విదితమే. అనివార్య కారణాల వల్ల జాతర సందర్భంలో అమ్మవారిని దర్శించుకునే అవకాశం లేని భక్తులు మరుసటి మంగళవారం దర్శించుకుని పూజలుచేసి మొక్కులు తీర్చుకో వడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. జాతర సంద ర్భంగా ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఐదు వేలమందికి అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో బలివాడ వెంకట మాధవరావు, ఎన్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు తులసీదాస్, గ్రంధి గోపి, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.



పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

దాడితల్లి వారాలు ప్రారంభం

బొబ్బిలి: గొల్లపల్లి శ్రీదాడితల్లి గ్రామదేవత పండుగను మే 19, 20, 21 తేదీ ల్లో జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో అమ్మవారి పండుగ వారా లను మంగళవారం నుంచి ప్రారంభించారు. బైపాస్ రోడ్డు జంక్షన్‌లో గల అమ్మవారి ఆలయంలో అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘటస్థాపన, విశేషపూజ, శ్రీచక్ర అర్చన, లక్ష్మీ హోమం నిర్వ హించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కాంగ్రెస్ నాయకుడు మువ్వల శ్రీనివాసరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా, మానవహారం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి): మిమ్స్ వైద్య కళాశాల(నెల్లిమర్ల)లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం వద్ద మంగళవారం మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వెంటనే న్యాయమైన కోర్కెలను యాజమాన్యం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత కొంత కాలంగా ఉ ద్యోగులు తమ డిమాండ్ల కోసం పోరాడుతున్నా యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తోందని, ఇప్పటికైనా చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ కూడలి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో మానవహారం నిర్వహించారు. 55 రోజులుగా ఆందోళన చేస్తున్నా సమస్యలను పరిష్కరించడం లేదని నినాదాలు చేశారు. యూనియన్ అధ్యక్షుడు టీవీ రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం అధికార యంత్రాంగాన్ని తప్పుతోవ పట్టిస్తోందన్నారు. మిమ్స్ ఉద్యోగులకు బకాయి ఉన్న ఏడు నెలల డీఏను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. వేతన ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగులపై వేధింపులు ఆపాలని, ప్రతి నెలా 1న కాంట్రాక్టు తదితర ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం నారాయణరావు, ఉద్యోగులు కామునా యుడు, నాగభూషణ అప్పలనా యుడు, ఆదినారాయణ, వరలక్ష్మి, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.



మానవహారం చేస్తున్న ఉద్యోగులు

గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి

తెర్లాం: సచివాలయ ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉద్దవోలుకు చెందిన ఉప్పాడ శ్రీకాంత్(29) సుందరాడ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. రోజూ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సచివాలయం నుంచి ఉద్దవోలులోని తన ఇంటికి వెళ్లి భోజనం చేసి వస్తుంటాడు. ఎప్పటిలాగే మంగళవారం కూడా సచివాలయం నుంచి తన తండ్రి రామారావును బైక్ పై ఎక్కించుకుని భోజనం కోసం ఇంటికి బయలుదేరాడు. అలా మాట్లాడుకుంటూ ఇంటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో ఒక్కసారిగా శ్రీకాంత్‌కు గుండెనొప్పి రావడంతో అక్కడిక్కడే బండిపై నుంచి పడిపోయాడు. తన కళ్లముందే కొడుకు నేలకొరగడంతో తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు. కొడుకును స్థానికుల సహాయంతో రాజాంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు ధ్రువీకరించారు. శ్రీకాంత్ మృతి పట్ల తోటి సచివాలయం ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. బొబ్బిలి నియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మండల నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



శ్రీకాంత్ (ఫైల్)

అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధం

బొండపల్లి: మండ లంలోని జేగుమడాం గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో కళ్లాల్లో ఉన్న వరిగడ్డివాములు దగ్ధమయ్యాయి. దీనికి సంబంధించి తహసీల్దార్ హనుమంతరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి దూరంగా కళ్లాలు ఉండడంతో పాటు అక్కడే వరి నూర్పులు చేసిన రైతులు గడ్డివాములను అక్కడే ఉంచారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామానికి చెందిన 9 మంది రైతులకు చెందిన 15 గడ్డివాములు మంటలకు ఆహుతయ్యా యి. సమాచారం అందుకున్న గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది ట్యాంకర్లతో నీటిని తెచ్చి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో వరిగడ్డివాముతోపాటు టేకు చెట్లు కొన్ని కాలిపోయాయని, సుమారు లక్ష రూపాయలకుపైగా నష్టం వాటిల్లినట్లు గుర్తించి నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించి నట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని అగ్నిమాపక సిబ్బందితోపాటు రెవెన్యూ సి బ్బంది, వైసీపీ నాయకులు మంత్రి గోవింద పాల్గొని బాధిత రైతులను ఆదుకో వాలని అధికారులను కోరారు.



దగ్ధమవుతున్న గడ్డివాములు

పూరిల్లు దగ్ధం

గజపతినగరం, మార్చి 26: మండలంలోని పాతబగ్గాం గ్రామంలో పూరిల్లు దగ్ధమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుమిలి ఈశ్వరరావు కుటుంబంతో కలిసి స్థానికంగా పూరింట్లో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా కాలి బూడదైంది. గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమచారం ఇచ్చినా వాహనం రాకపోవడంతో గ్రామస్థులే మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం సంభవించిందని బాధిత కుటుంబం తెలిపింది.

తండ్రీ కొడుకులపై దాడి

బొబ్బిలి, మార్చి 26: బంధువుల మధ్య జరిగిన తగాదాలో తండ్రీకొడుకులను గాయపరిచిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తారకరామాకాలనీకి చెందిన బొత్స రామారావు రెండో కుమారుడు లక్ష్మణరావుకు సీతానగరం మండలం కాశయ్యపేట గ్రామానికి చెందిన నందిత అనే యువతితో ఆరునెలల క్రితం వివాహమైంది. పెయింటర్‌గా పనిచేస్తున్న లక్ష్మణరావు తన భార్య నందితను నిత్యం వేధిస్తుండడంతో ఆమె తన తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. దీనితో నందిత తండ్రి కళింగపట్టపు పైడిరాజు, సోదరుడు దుర్గారావు మంగళవారం తారకరామాకాలనీకి వచ్చి లక్ష్మణరావును అతని కుటుంబ సభ్యులను నిలదీశారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగడంతో పైడిరాజు, దుర్గారావు కలిసి నందిత మామ బొత్స రామారావును, అతని పెద్దకుమారుడు కిశోర్‌ను బీరుసీసాతో కొట్టి గాయపరిచారు. తీవ్ర గాయాలపాలైన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 113 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ వెంకటరావు తెలిపారు. వన్‌టౌన్ ఎస్ఐ నవీన్ పడాల్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సాగర్‌బాబులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వలపన్ని నిందితులను పట్టుకున్నారని చెప్పారు.

రేగిడి: మండలంలోని అక్కన్నఅగ్రహారానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఎన్నికల సోదాల్లో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో ఉంగరాడమెట్టసెంటర్ నుంచి బెల్ట్ షాపునకు మద్యం తరలిస్తుండగా పట్టుకుని అరెస్టుచేసినట్లు చెప్పారు.

వైభవంగా వేదమాత గాయత్రి వార్షికోత్సవం

లక్కవరపుకోట, మార్చి 26: మండలంలోని రేగ గ్రామంలో వెలసిన ప్రఖ్యాత వేదమాత గాయత్రిదేవి ఆలయం వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి దంపతులు హాజరయ్యారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. ఆలయ పూజారి నారాయణమూర్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ప్రసాదాన్ని కోళ్ల దంపతులకు అందజేశారు.

అశోక్‌ను కలిసిన కోళ్ల

శృంగవరపుకోట: శృంగవరపుకోట టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి మంగళవారం రాత్రి విజయనగరంలో మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గ జపతి రాజును కలిశారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ ఎస్.కోటలో టీడీపీ జెండా ఎగురవేస్తామని, మీ అందరి సహకారం కావాలని కోరారు. విజయనగరం టీడీపీ అభ్యర్థి అదితిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాడంగిలో పరదేశమ్మ అనుపోత్సవం

బాడంగి, మార్చి 26: పరదేశమ్మ అనుపోత్సవాన్ని బాడంగిలో మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి దాటిన 15 రోజులకు గ్రామ దేవతలైన పరదేశమ్మ, పోలమ్మ తల్లి పండగలను జరపడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఉదయం నుంచి ఉపవాసాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. బాడంగితోపాటు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. ఎస్ఐ జయంతి బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి గుడివద్ద గ్రామ పొలిమేరలో కట్టిడి చేస్తున్న యువకులు

ముగిసిన ముత్యాలమ్మ పండుగ

వేపాడ: మండలంలోని సోంపురంలో మూడురోజుల పాటు నిర్వహించిన ముత్యాలమ్మ తీర్థం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్లపందాలు, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామీణులను అలరించాయి.



సోంపురం ముత్యాలమ్మ తీర్థంలో ఆకట్టుకున్న ఎడ్లపందాలు

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

రాజాం రూరల్: ప్రాథమికస్థాయి లో విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడి న విద్య అవసరమని ఎంఈవో-2 దు ర్గారావు తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటి వలస ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పరిశీలించారు. విద్యార్థుల హాజరుతో పాటు వారిని రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పై ప్రశ్నించారు. హెచ్ఎం విజయకుమారి ఉన్నారు.

వంగర: పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషిచేయాలని రేగిడి ఎంఈవో ప్రసాదరావు కోరారు. మంగళవారం అరసాడప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు.

రేగిడి: పాఠ్య ప్రణాళికలతో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈవో-2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలో అంబాడ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం పరిశీలించారు. విద్యాప్రమాణాలు, వర్క్‌బుక్స్ నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, మధ్యాహ్నభోజనం అమలును సమీక్షించి హెచ్ఎం మీసాల సత్యంనాయుడుకు పలు సూచనలు చేశారు.

వంతెన పనులు పూర్తి చేయాలి

సీతానగరం: సువర్ణముఖి నదిపై సీతానగరం వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు పూర్తి చేయాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన టీడీపీ మండల నాయకులతో కలిసి పాత, కొత్త వంతెనలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత వంతెన శిథిలావస్థలో ఉందని కొత్త వంతెన నిర్మాణానికి రూ.12కోట్లు నిధులు మంజూరు చేసి, ఏడేళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే మిగిలిందన్నారు. పాత వంతెనకు మరమ్మత్తుల పేరిట రూ.1.29కోట్లు ఖర్చు చేసినా, పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపట్టలేదని ఆరోపించారు. పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని అన్ని వర్గాల వారు భయాందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తక్షణమే నూతన వంతెన పనులు పునః ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల నాయకులు సత్యంనాయుడు, వేణుగోపాల్‌నాయుడు, తెంటు వెంకటఅప్పల నాయుడు, కె.అరవింద్, సూర్యనారాయణ, సింహాలనాయుడు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా


లింగాలవలసలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

గజపతినగరం: ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తహసీల్దార్ సీహెచ్ రమేష్ తెలిపారు. మండలంలోని ఎం.గుమడాం, లింగాలవలస గ్రామాల్లోగల ఏడొంపుల గెడ్డ, చంపావతి నది పరివాహక ప్రాంతం తుమ్మికాపల్లి, లోగిస గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అక్రమ రవాణా నివారణకు రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ మన్మథరావు, ఆర్.సుమ, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'అవి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలోకి రావు'

సీతంపేట: కోడ్ అమలుకు ముందు లబ్ధిదారులకు పంపిణీచేసిన కార్డులు, శిలాఫలకాలు ఉన్న ఫొటోలు, పేర్లకు సంబంధించిన ఎటువంటి జోక్యం అవసరం లేదని ఎన్నికల ప్రవర్తనా నియమావళి స్పష్టంగా తెలియజేసిందని ఐటీడీఏ పీవో, పాలకొండ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కోడ్ పట్టదా శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో ఆమె స్పందించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రాకముందు జరిగిన కార్యక్రమాలు కోడ్ ఉల్లంఘన కిందకు రావని పేర్కొన్నారు.

గిరిజనుల సామగ్రి ఇవ్వండి


సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం(ఫైల్)

కొమరాడ: పెద్దశాఖ పంచాయతీ దర్భింగి గ్రామానికి చెందిన పలువురు గిరిజనుల నుంచి అటవీశాఖ సిబ్బంది తీసుకున్న గొడ్డళ్లు, కత్తులను తక్షణమే ఇవ్వాలని సీపీఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గిరిజనులకు పోడు వ్యవసాయమే జీవనాధారమన్నారు. అటువంటి పోడు కొట్టకూడదంటూ అటవీశాఖ సిబ్బంది వారి వద్ద ఉన్న సామగ్రిని తీసుకోవడం, కేసులు నమోదు చేస్తామని బెదిరించడం దుర్మార్గపు చర్యని అన్నారు. తక్షణమే గిరిజనుల నుంచి తీసుకున్న సామగ్రిని అందించి, వారు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎన్నికలకు గ్రామ స్థాయి సిబ్బంది నియామకం

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామ స్థాయిలో ఎన్నికల నిబంధనల పరిశీలనకు అధికారులను నియమించాలని కురుపాం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వీవీ రమణ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కురుపాం మండలంలో 20 పంచాయతీలకు వీఆర్వోలు, కార్యదర్శులు, గుమ్మలక్ష్మీపురం మండలంలో 24 పంచాయతీలకు, జియ్యమ్మవలస మండలంలో 25 పంచాయతీలకు, కొమరాడ మండలంలో 20 పంచాయతీలకు, గరుగుబిల్లి మండలంలో 25 పంచాయతీలకుగాను నియామకం చేశారు. రాజకీయ పార్టీల ప్రచారాలతో పాటు ఘర్షణలు, తదితర సమాచారాన్ని మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు, తహసీల్దార్లకు ఎప్పటికప్పుడు సమాచారం విధిగా అందించాలని ఆర్వో ఆదేశించారు. కేటాయించిన పంచాయతీల్లో నిర్లక్ష్యం వహించకుండా నివేదికలను అందించాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు వ్యవహరించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఏఏకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురం టౌన్: సీఏఏ అమలు ఆపాలని కోరుతూ వామపక్షాలు, ప్రజాతంత్ర, లౌకిక వాద సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక చర్చివీధి కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వామపక్ష నాయకుడు రెడ్డి వేణు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం సీఏఏ చట్టాన్ని అమలు జరిపి, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను విద్యావంతులు, మేధావులు వ్యతిరేకించాలని ఆయన కోరారు.

ఉపకరణాల కోసం ఎంపిక


మాట్లాడుతున్న ఎంఈవో రాధాకృష్ణమూర్తి

కురుపాం: ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు తల్లిదండ్రులు మనోధైర్యం ఇచ్చి వారికి వారి అభివృద్ధికి కృషి చేయాలని కురుపాం ఎంఈవో రాధాకృష్ణమూర్తి కోరారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఉపకరణాల ఎంపిక కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 75 మంది ప్రత్యేక అవసరాలుగల పిల్లలు హాజరు కాగా, 55 మందిని ఉపకరణాల మంజూరు కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్య నిపుణులు ఆశాలత, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు శేఖర్, తదితరులు, ప్రత్యేక అవసరాలుగల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీర్ణ వ్యవస్థలో పెద్దపేగు కీలకం

నెల్లిమర్ల: జీర్ణవ్యవస్థలో పెద్దపేగు కీలకమని సెంచూరియన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి పింగళి సాయి మేఘన అన్నారు. యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె లండన్ నుంచి వర్చువల్ విధానంలో కొలనోస్కోపీ మీద ప్రసంగించారు. పెదపేగు ఆహారంలోని నీటిని, పొటాషియం వంటి లవణాలను, కొవ్వులో కరిగే విటమిన్‌లను గ్రహించి శరీరానికి అందించడమే కాక, శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపటంలోనూ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, విభాగం అధిపతి నూకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రారంభోత్సవం

రేగిడి: లక్ష్మీపురంలో విజయదుర్గ, లక్ష్మీగణపతి- వల్లి దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఖండ్యాంకు చెందిన వేదపండితుడు అంపోలు రుద్ర కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కెంబూరు తేజ వెంకటేశ్వరరావు, గ్రామ పురోహితులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

చంద్రబాబుతోనే సంక్షేమం

- గ్రామాల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థుల పర్యటన
- బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీపై ప్రచారం


మక్కువ: పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న సంధ్యారాణి


పార్వతీపురం రూరల్: విజయచంద్రకు స్వాగతం పలుకుతున్న అభిమానులు


కురుపాం రూరల్: మామిడిమానుగూడలో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

రాష్ట్రంలో సంక్షేమ పాలన రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

మక్కువ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సన్యాసిరాజపురం, చెముడు పంచాయతీల్లోని గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు.

50 కుటుంబాలు చేరిక

చెముడు గ్రామం నుంచి 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి సంధ్యారాణి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి బి.గౌరీశంకర్, గొగాడ భూషన్, తిరుపతి, మల్లేశ్వరరావు, జనసైనికులు పాల్గొన్నారు.

పెద్దబొండపల్లిలో విజయచంద్ర పర్యటన

పార్వతీపురం రూరల్: పెద్దబొండపల్లి గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర మంగళవారం పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి, సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. విజయచంద్రకు మహిళలకు మంగళ హారతులు పట్టారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలకంఠాపురం పంచాయతీలో జగదీశ్వరి..

కురుపాం రూరల్: నీలకంఠాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి తోయిక జగదీశ్వరి మంగళవారం పర్యటించారు. చింతమానుగూడ, జుంబిరి, మామిడిమానుగూడ, నాయుడుగూడ, పెద్దగూడ, సంగెడ్డ, శింగుపురం, గుజ్జిపాడు గ్రామాల్లో ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. టీడీపీ మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, పార్టీ నాయకులు వెంపటాపు భారతి, సుఖేష్‌చంద్ర పండా, రంజిత్‌కుమార్ నాయికో, కోలా రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులకు బిల్లులు చెల్లించాలి


మాట్లాడుతున్న గంగునాయుడు

జియ్యమ్మవలస: జిల్లాలో జనవరి నెల నుంచి ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జియ్యమ్మవలసలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని గిరిజనులు, పేదలు ఉపాధి లేక ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, సక్రమంగా ఉపాధి పనులు కల్పించడం లేదని ఆరోపించారు. పనులు కల్పించినా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదన్నారు. బకాయి బిల్లులు చెల్లించాలని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేసినప్పటికీ జిల్లా అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి బకాయిలు విడుదల చేసి వేతనదారుల ఆకలి బాధలు తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంగం మండల కార్యదర్శి బి.మోహనరావు, వేతనదారులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి జాతరలు

భోగాపురం: మండలంలోని భోగాపురం గ్రామంలో కనకదుర్గమ్మ, పోలిపల్లి గ్రామంలో పైడితల్లమ్మ జాతరలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయాల వద్ద వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. భక్తులకు టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి, తదితర నాయకులు అమ్మవార్లను దర్శించుకున్నారు. సీఐ ఎ.రవికుమార్, ఎస్ఐలు పి.సూర్యకుమారి, డి.తాతారావు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.


పోలిపల్లి అమ్మవారి ఆలయం ముందు భక్తుల కోలాహలం


భోగాపురంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సీతానగరం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతిఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఈశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ రాజేష్ హెచ్చరించారు. వారు ఈ మేరకు వారు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల రాజకీయ నాయకులు, పత్రికా విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సభలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మండలంలో అన్ని వర్గాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటన


సతివాడలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ, తంగుడుబిల్లి, సీతారామునిపేట సచివాలయాల పరిధిలోగల గ్రామాల్లో ఎంపీడీవో జి.రామారావు మంగళవారం పర్యటించారు. ఎన్నికల కోడ్ అమలుపై ఆరా తీశారు. ఆయా సచివాలయాల్లో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్లు ప్రచారానికి వెళ్లొద్దు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భామిని: ఎన్నికల నిబంధనలు మేరకు డీలర్లు, ఎండీయూ డ్రైవర్లు ఎటువంటి ప్రచారానికి వెళ్లకూడదని తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. భామిని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌరసరఫరాల ద్వారా సరుకులు ఇంటింటికి పంపిణీ చేయాలని సూచించారు. వలంటీర్లను జోక్యం చేసుకోకుండా చూడాలని, ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలు సహకరించాలి


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

రేగిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలు సమస్యలు తలెత్తకుండా ప్రజలు సహకరించాలని ఎస్ఐ శ్రీనివాస్ కోరారు. మంగళవారం అంబాడలో ప్రశాంత ఎన్నికల నిర్వహణపై రేగిడి పోలీసులు చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత జూదం, మద్యానికి దూరంగా ఉండాలని, ఎన్నికల్లో శాంతిభద్రతలు తలెత్తితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు


రావివలసలో కవాతు చేస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని ఎస్ఐ వై.అమ్మన్నరావు సూచించారు. ఈ మేరకు మంగళవారం రావివలస, లఖనాపురం పంచాయతీల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

క్లుప్తంగా..

రంగులు మారాయి

గరుగుబిల్లి: తోటపల్లి పంచాయతీ నందివానివలస రహదారికి ఆనుకుని గతంలో నిర్మించిన తాగునీటి రక్షిత పథకంపై ఉన్న వైసీపీ రంగు మారింది. మంగళవారం ఆంధ్రజ్యోతిలో కోడ్ పట్టదా శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. రక్షిత పథకంపై ఉన్న నీలిరంగుపై వేరే రంగును వేశారు. అలాగే గరుగుబిల్లి ఆర్బీకేపై ఉన్న వైసీపీ రంగులు చెరిపేశారు.

చీపురుపల్లిలో రక్తదాన శిబిరం

చీపురుపల్లి: సినీ నటుడు రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లాన వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. మెగా అభిమానులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సేవ చేశాం

గుర్ల: రాగోలు గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన సిద్ధం కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సేవ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

178 మందికి కంటి పరీక్షలు

పాలకొండ: పాలకొండలో మంగళవారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ 178 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించింది. అవసరమైన వారికి మందులు అందించారు. ఎంపిక చేసిన వారికి విశాఖపట్నం తీసుకెళ్లి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛంద సంస్థకు విరాళం

గరివిడి: గర్భాం గ్రామంలోని ఇండిసిల్ హైడ్రో పవర్ అండ్ మాంగనీస్ కంపెనీ గరివిడిలో ఉన్న ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు రూ.లక్ష విరాళం ఇచ్చింది. ఈ చెక్కును కంపెనీ యూనిట్ హెడ్ వాకాడ గోపి, సెంటర్ వైస్ ప్రెసిడెంట్ జి.రామకృష్ణకు అందజేశారు.

గొల్లపేరంటాలు హుండీ ఆదాయం రూ.2.5లక్షలు

చీపురుపల్లి: మెట్టపల్లి గ్రామంలో వెలసిన శ్రీగొల్లపేరంటాలు అమ్మవారికి హుండీ ద్వారా రూ.2,51,738 లభించినట్టు ఈవో జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి నాలుగు రోజుల పాటు జాతర ఉత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలు మంగళవారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం గ్రూపు దేవాలయాల మేనేజరు కె.శ్రీరామ్, పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కురుపాంలో డోలోత్సవం


జగన్నాథస్వామి ఆలయంలో డోలోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కురుపాం: కురుపాంలో డోలోయాత్ర ఘనంగా జరిగింది. స్థానిక శివ్వన్నపేటలో జగన్నాథ ఆలయంలో సోమవారం సాయంత్రం నుంచి డోలోత్సవం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా చిన్నికృష్ణుడి విగ్రహాన్ని ఊయ్యాలలో ఉంచి డోలోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాలకు చెందిన భక్తులు సోమవారం రాత్రి, మంగళవారం పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా యాత్ర నిర్వహించారు. రాత్రి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

డెంకాడ: స్థానికంగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వర్షాల కోసం వల్లమాంబకు పూజలు


వల్లమాంబ చెట్టు వద్ద పూజచేస్తున్న భక్తులు

సాలూరు రూరల్: ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ మామిడిపల్లివాసులు మంగళవారం మామిడిపల్లిలోని వల్లమాంబ అమ్మవారికి పూజలు నిర్వహించారు. వల్లమాంబ చెట్టు వద్దకు ముర్రాటలతో వెళ్లి, మొక్కులు చెల్లించారు.